
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
గురువారం, 26 డిసెంబరు 2024




ఖమ్మంలోని సీఎస్ఐ చర్చిలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

CENTENARY OF STRUGGLES & SACRIFICES

ఉద్యమ స్ఫూర్తికి.. అరుణ ‘వంద’నం

- శత వసంతంలోకి భారత కమ్యూనిస్టు పార్టీ
- నేడు ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో సీపీఐ 100వ ఆవిర్భావ సభ
- వందమంది రెడ్‌షర్ట్ వలంటీర్లతో కవాతు
- హాజరుకానున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, ఇతర నేతలు

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక, రైతు, రైతుకూలీల సమస్యలే ప్రధాన అజెండాగా ఎన్నో భూ పోరాటాలను నిర్వహించి తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ముందుండి నడిచిన భారత కమ్యూనిస్టు పార్టీ 99 ఏళ్ల తన రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకొని గురువారం వందేళ్ల సంబురాలకు సిద్ధమైంది. 1925 డిసెంబరు 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక భూపోరాటాలు, సింగరేణి కార్మికుల


(మిగతా 6వ పేజీలో)

అర్బన్‌లో అటవీ అందాలు

రాష్ట్రస్థాయి పర్యాటక కేంద్రంగా ఖమ్మం అర్బన్ పార్కు గుర్తింపు 6

ఈ ఏడాది ధాన్యం రైతులకు ‘బోనస్’ రూపంలో అదనపు ఆదాయ ‘భరోసా’ లభించింది. సన్నాలు పండించిన రైతులకు అసలు ధరతో పాటు ప్రభుత్వం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లింస్తుండడంతో రైతులకు అదనపు ఆదాయం లభిస్తోంది. ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు 25,328మంది రైతులకు రూ.75.32కోట్ల బోనస్ లభించింది. మొత్తం 15,06,424 క్వింటాళ్ల సన్నధాన్యం కొనుగోలు చేసినందుకు ఈ బోనస్ చెల్లించారు.

- జిల్లాలో 2.01లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం కొనుగోలు
- రైతుల ఖాతాల్లో రూ.368కోట్లు జమ
- ప్రభుత్వం బోనస్‌గా రూ.75.32కోట్ల చెల్లింపు
- జనవరి వరకు కొనసాగనున్న ధాన్యం సేకరణ



బోనస్‌తో భరోసా

ప్రభుత్వ పథకంతో రైతులకు అదనపు ఆదాయం

ఖమ్మం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మొదటిసారి ధాన్యం రైతులకు భారీగా అదనపు ఆదాయం అందుతోంది. ప్రభుత్వం క్వింటాకు ధాన్యం ఏ-గ్రేడ్‌కు రూ.2,320, బీ-గ్రేడ్‌కు రూ.2,300 చొప్పున ధర నిర్ణయించగా సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తోంది. దీంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకుని లాభం పొందుతున్నారు.

అయితే ఈసారి ప్రైవేటులో కూడా ధాన్యం ధరలు అధికంగా ఉండడంతో అటు ప్రభుత్వ కొనుగోళ్లు ఇటు ప్రైవేటు కొనుగోళ్లతో ధాన్యం ధర స్థిరంగా ఉంది. గతంలో సీజన్ మొదట్లో ఎక్కువ ధర తర్వాత మిల్లర్లు సిండికేట్‌గా మారి ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేసిన సందర్భాలున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పూర్తిస్థాయిలో అమ్మే పరిస్థితి ఉండడంతో ప్రైవేటు వ్యాపారుల, రైస్‌మిల్లర్లు కూడా ప్రభుత్వ ధరతో పోటీగా ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

జిల్లాలో 344 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి ధాన్యం సేకరణ చేస్తున్నారు. ఇప్పటివరకు అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి 2.01మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మొత్తం రూ.468కోట్ల వ్యాపారం జరగ్గా రూ.367.53కోట్లు రైతులకు చెల్లించారు. ఇంకా రూ.100.92కోట్లు చెల్లించాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం కొనుగోళ్లు సాగుతూనే ఉన్నాయి. వచ్చే జనవరి వరకు ధాన్యం కొనుగోళ్లు జరపాలని అధికారులు నిర్ణయించారు.

వాస్తవానికి 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు 50శాతమే పూర్తయ్యింది. అయితే ప్రైవేటు వ్యాపారులు మిల్లర్లు పోటీపడి కల్లాల్లోనే ధాన్యం కొనుగోలు చేశారు. దీంతో సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటికే ప్రైవేటు వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేసి తీసుకెళ్లారు. ప్రభుత్వ మద్దతు ధర ఇస్తున్నట్టుగానే ప్రైవేటు వ్యాపారులు కూడా ఈసారి గిట్టుబాటు ధర ఇవ్వడంతో రైతులు తేమతోనే ధాన్యం విక్రయించారు.

ప్రస్తుతం ఆలస్యంగా వేసిన వరి పొలాలు కోతకు వస్తున్నాయి. ముఖ్యంగా సాగర్ ఆయకట్టులో ముమ్మరంగా వరికోతలు సాగుతున్నాయి. ఇంకో 25వేల మె.టన్నుల ధాన్యం సంక్రాంతిలోగా వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జనవరి నెలాఖరులోగా మరో 25వేల మె.టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది.

రూ.75.32కోట్లు బోనస్

జిల్లాలో ఇప్పటి వరకు 15,06,424 క్వింటాళ్ల సన్నధాన్యం కొనుగోలు చేసినందుకు రూ.25,328మంది రైతులకు ప్రభుత్వం రూ.75.32కోట్లు బోనస్‌గా చెల్లించింది. మొదట్లో బోనస్ చెల్లింపు ఆలస్యమవుతుందని రైతులు ప్రైవేటు వైపు మొగ్గు చూపారు. కానీ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే బోనస్ రైతుల ఖాతాల్లో జమ అవుతుండడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మేందుకు రైతులు ఆసక్తిచూపుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించకపోతే జిల్లాలో పండిన ధాన్యంలో మూడొంతులపైగా ప్రైవేటు మిల్లర్లు, వ్యాపారులే కొనుగోలు చేసేవారు. బోనస్ లేకుంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నామమాత్రంగానే ధాన్యం సేకరణ జరిగేది. కానీ బోనస్‌తో రైతులకు లాభం చేకూరింది. రైతులకు ఆదాయ భరోసా లభించింది.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు

- ఘనంగా ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు
- అర్ధరాత్రినుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం : భట్టి
- ఖమ్మం సీఎస్ఐ చర్చి వేడుకల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్/మధిర రూరల్/ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిచారు. అర్ధరాత్రి నుంచే క్రైస్తవులు చర్చిల్లో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు చర్చిలకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఖమ్మంలోని సీఎస్ఐ చర్చిలో జరిగిన వేడుకల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్తుపల్లిలో స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్‌లు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. బాలఏసు లోకానికి వచ్చిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని క్రీస్తు విశ్వాసులు క్రిస్మస్ కేక్‌లు కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వేకువజామునుంచే చర్చిల్లో భక్తుల సందడి నెలకొంది. ప్రార్థనల అనంతరం పలువురు తమ బంధువులు, మిత్రులను విందులకు ఆహ్వానించారు. కొందరు పేదలకు దాన ధర్మాలు చేశారు. రగ్గులు, దుప్పట్లు, పండుగ సామగ్రిని పంపిణీ చేశారు.

భద్రాద్రి జిల్లాలో..

కొత్తగూడెం పట్టణంలోని సీఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో డోర్నకల్ బిషప్ డాక్టర్ రెవరెండ్ కోడిరెక్కల పద్మారావు ముఖ్య అతిథిగా హాజరై దైవసందేశాన్ని వినిపించారు. కొత్తగూడెం ఆర్సీఎం చర్చిలో జరిగిన ప్రార్థనలో ఫాదర్ జయ ఆనంద్ దైవసందేశాన్ని వినిపించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, పినపాక, అశ్వారావుపేట (మిగతా 6వ పేజీలో)



బయ్యారం చర్చిలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మురిపించి మూలకేశారు!

- అసంపూర్తిగా ‘సీతారామ’ ఏన్కూర్ లింక్‌కెనాల్ పనులు
- భూ నిర్వాసితులకు నేటికీ అందని పరిహారం
- మంత్రి తుమ్మల చొరవతో మొదట్లో చురుగ్గా సాగిన నిర్మాణం
- సీఎం పర్యటన తరువాత తగ్గిన పర్యవేక్షణ
- వచ్చే ఆగస్టు నాటికైనా పూర్తయ్యేనా అని రైతుల అనుమానం



అసంపూర్తిగా ఏన్కూర్ లింక్‌కెనాల్

ఏన్కూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సీతారామ ఏన్కూరు లింక్‌కెనాల్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సుమారు వంద రోజుల్లో పూర్తికావాల్సిన పనులు ఏడాదికైనా పూర్తవుతాయో లేదో తేలియని పరిస్థితి నెలకొంది. రూ.100కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు మొదట్లో వేగంగా జరిగాయి. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవ తీసుకుని తరుచూ క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు వేగవంతం చేయించారు ఆగస్టు 15న సీఎం రేవత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించాలని భావించినా పనులు పూర్తి కాకపోవడంతో ప్రారంభించలేదు. ఆ తరువాత పనుల్లో వేగం తగ్గింది. ప్రస్తుతం ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికైనా పనులు పూర్తవుతాయో లేదోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఈ కాలువకు భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం రాకపోవడంతో వారు కాల్వ పనులకు అడ్డుపడుతున్నారు. మంత్రి తుమ్మల హామీ మేరకు సుమారు 100మంది రైతులు ఈ ప్రాజెక్టుకు భూములు ఇచ్చారు. ఇటీవల భూనిర్వాసితులకు ఖమ్మం కలెక్టర్ ఆదేశాల మేరకు ఎకరానికి రూ.20లక్షలు నష్టపరిహారం నిర్ణయించినట్టు అధికారులు తెలుపగా రైతులు దానికి అంగీకరించలేదు. ఎకరానికి రూ.30లక్షలు ఇస్తేనే అంగీకరిస్తామని కరాఖండిగా చెప్పారు. దాంతో పరిహారం నిర్ణయం ఎటూ తేలకుండా పోయింది. ఈ లింక్‌కెనాల్ పూర్తయితే సుమారు లక్షా 50వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుంది. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాలు సస్యశ్యామలం కానున్నాయి. వైరా రిజర్వాయర్, సత్తుపల్లి లంకాసాగర్ ప్రాజెక్టు, వైరా నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను నింపేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ కాలువ పనులు నిలిచిపోవడంతో రైతులు ఉసూరుమంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భూ నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీలు అందించి లింక్‌కెనాల్ పనులను త్వరగా పూర్తిచేయించాలని రైతులు కోరుతున్నారు.

వణికించిన చిరుజల్లులు

- తుఫాన్ ప్రభావంతో జిల్లాలో మోస్తరు వర్షం
- కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని పట్టాలతో భద్రపరుచుకున్న రైతులు
- చలిగాలులతో ఇబ్బందిపడ్డ వృద్ధులు, పిల్లలు





ఖమ్మం జిల్లా కొణిజర్లలో వాతావరణం మబ్బులు పట్టడంతో ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు

కొత్తగూడెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. దాంతో రైతులు ఆందోళన చెందారు. కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం రాసులు తడవకుండా ముందుజాగ్రత్తగా రైతులు ధాన్యంపై పట్టాలు కప్పారు. వాతావరణం మబ్బులు పట్టి ఉండి చలిగాలులు వీచడంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడ్డారు. కొన్నిచోట్ల చేలల్లో పత్తి తడవడంతో ధర తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి జిల్లాలో ఏపీ సరిహద్దులో ఉన్న అశ్వారావుపేట, దమ్మపేట, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, భద్రాచలం, పినపాక, దుమ్ముగూడెం, చర్ల, కరకగూడెం, ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కొత్తగూడెం, చుంచుపల్లి, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, టేకులపల్లి, ఇల్లెందు తదితర మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. ఇక బుధవారం క్రిస్మస్ ప్రార్థనలకు వెళ్లే భక్తులు కూడా చిరుజల్లులు, చలిగాలులతో ఇబ్బంది పడ్డారు. ఖమ్మం జిల్లాలో వాతావరణ రోజంతా మబ్బులు కమ్మి ఉంది. ఉదయం కొన్ని మండలాల్లో చిరుజల్లులు కురిశాయి.

ఘనంగా ముక్కోటి ఏర్పాట్లు

- ఏకాదశి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా లేజర్‌షో
- భక్తుల కోసం రెండు లక్షల లడ్డూలు సిద్ధం చేస్తున్నాం
- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా భద్రాద్రి పరిసరాల ముస్తాబు
- వివరాలు వెల్లడించిన భద్రాద్రి దేవస్థానం ఈవో రమాదేవి

భద్రాచలం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గతంలో కంటే ఘనంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. దేవస్థానంలోని చిత్రకూట మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ముక్కోటి ఏర్పాట్లపై ఇప్పటికే భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఆర్డీవోలు సమీక్ష నిర్వహించడంతోపాటు పలు సూచనలు చేశారని తెలిపారు. ఈ ఏడాది గతంలో కంటే భారీ సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాతో రూ.1.20కోట్లతో ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. ఈ ఉత్సవాల్లో తొలిసారిగా రూ.18లక్షలతో ఏర్పాటు చేస్తున్న లేజర్‌షో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. భక్తులకు విక్రయించేందుకు రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేయడంతోపాటు అదనపు కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే 75శాతం ముక్కోటి ఉత్తరద్వార దర్శనం టికెట్లను భక్తులకు ఆన్‌లైన్‌లో విక్రయించేందుకు అందుబాటులో ఉంచామన్నారు. పట్టణంలో సైతం ప్రత్యేక కౌంటర్ల ద్వారా టికెట్లను విక్రయిస్తున్నామన్నారు.

31 నుంచి జనవరి 8 వరకు శ్రీసీతారామచంద్రస్వామి దశావతారాలు జరిగే మిథిలా స్టేడియంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చేందుకు ప్రత్యేక వేదిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. తెప్పోత్సవం జరిగే జనవరి 9న గోదావరి ఒడ్డున భక్తులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలువనుందన్నారు. అలాగే తొలిసారిగా నది ఒడ్డున గిరిజన ఉత్పత్తుల స్టాల్స్, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని ఈవో రమాదేవి వివరించారు. స్వామివారి ఉత్తరద్వార దర్శనం రోజైన పదో తేదీ అర్ధరాత్రి నుంచే భక్తులకు దర్శనాలు ఉంటాయని తెలిపారు. అలాగే అర్ధరాత్రి 12 గంటలకు అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దారుచే స్వామివారికి తొలి అభిషేకం ఉంటుందన్నారు.

మిథిలాస్టేడియంలో సెక్టార్ల వద్ద అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని, ఉత్తరద్వార దర్శనానికి సెక్టార్లలో కూర్చునే భక్తులతో పాటు రామాలయ పరిసరాల్లో ఎల్ఈడీ స్క్రీన్లపై కూడా భక్తులు వీక్షించేలా ఏర్పాట్లు ఉంటాయన్నారు. భద్రాచలం వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని వెళ్లేలా అన్ని రకాల



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రమాదేవి

ఏర్పాట్లు కొనసాగుతున్నాయని ఈవో వివరించారు. ఈ ఏడాది ముక్కోటికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చే భక్తుల కోసం పర్యాటక, ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉంటున్నాయన్నారు. ముక్కోటికి వచ్చే భక్తులకు గిరిజన మ్యూజియాన్ని వీక్షించే అవకాశంతో పాటు గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేసేలా ఈ ఏడాది పర్యాటకంగా అనేక ఏర్పాట్లను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలను భక్తులు, ప్రకృతి ప్రేమికులు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో ఈఈ రవీంద్రనాథ్, ఏఈవో భవానీరామకృష్ణ, ప్రధాన అర్చకులు విజయరాఘవన్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- ‘ప్రజాపాలన’లో 3,57,869 దరఖాస్తులు
- ఇప్పటి వరకు 2,19,224 దరఖాస్తుల సర్వే పూర్తి
- నెలాఖరుకు పూర్తి చేస్తాం: గృహ నిర్మాణశాఖ పీడీ శ్రీనివాస్

7



ఆనంద సాగరం



- ఆశాజనకంగా శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటిమట్టం
- ముమ్మరంగా యాసంగి సాగు
- పొదుపుగా వాడుకుంటే వచ్చే సీజన్‌కు కూడా నీరు

7

రామయ్యను దర్శించుకున్న డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్

భద్రాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామిని రాష్ట్ర డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లా డిస్ట్రిక్ట్ డ్రగ్ లైసెన్సింగ్ అథారిటీ జి.రాజ్యలక్ష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అంతరాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అనంతరం అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సోమశేఖర్ పరిమి పాల్గొన్నారు.

మాలమహానాడు ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతుల దహనం

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం మనుస్మృతి ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాల మహానాడు సీనియర్ నాయకుడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి ఉమ్మడి ఖమ్మంజిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం మాట్లాడుతూ బహుజన హక్కుల కోసం సామాజిక, సమానత్వం కోసం పోరాటం చేసే క్రమంలో మనువాద రాజ్యాంగ విధానాలను ధ్వంసంచేయాలని అంబేద్కర్ మనుస్మృతిని తగులబెట్టారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో డిసెంబరు 25న మనుస్మృతి దహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు గులగట్టు యల్లయ్య, గుమ్మడి కనకరాజు, దాసరి శ్రీనివాస్, తురక నాగేశ్వరరావు, పేరం మల్లయయ, తలారి రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌ను కలిసిన తమ్మినేని

భద్రాచలం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని చింతూరు మండలం నిమ్మలగూడెంలో బుధవారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్‌ను సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ సేవా కార్యక్రమాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రపంచానికి ప్రస్తుతం కావాల్సింది నాణ్యమైన వైద్యం అందించే వైద్యులే అన్నారు. రసాయనిక జంక్ ఫుడ్స్ కలుషిత ఆహారాలు తీసుకుంటున్న మనుషులు రోజుకో కొత్త వ్యాధులతో బాధపడుతున్నారని దీని వల్ల కుటుంబ ఆర్థిక వ్యవస్థపై తీరిన ప్రభావం పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బ్రహ్మచారి, పల్లపు వెంకట్, సీసం సురేష్, పొడియం లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్బన్‌లో అటవీ అందాలు

- నాడు నందనవనంగా నామకరణం నేడు అర్బన్ పార్కుగా ఖ్యాతి
- 48వ వసంతంలోకి ఖమ్మం అర్బన్ రిజర్వ్ పార్కు
- 1977 డిసెంబరు 15న రిజర్వ్ ఫారెస్టుగా 543 ఎకరాలతో ఏర్పాటు
- ఇప్పటికీ 300 ఎకరాల్లో సంరక్షణ
- రాష్ట్ర మంత్రి తుమ్మల చొరవతో రూ.3 కోట్లతో అభివృద్ధి కార్యాచరణ
- రాష్ట్ర స్థాయి పర్యాటక కేంద్రంగా ఖమ్మం అర్బన్ పార్కు గుర్తింపు



అర్బన్ పార్కు

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు 25: పచ్చని వాతావరణం, ఆహ్లాదాన్ని పంచుతున్న చెట్లు, పిల్లల నుంచి పెద్దల వరకు సేదతీరేందుకు అనువైన చోటు.. అటవీ శాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్న ఖమ్మం అర్బన్ పార్కు. అందరినీ ఆకట్టుకుంటోంది. ఉమ్మడి రాష్ట్రంలో అటవీ సంరక్షణ చట్టం 1967 మేరకు ఖమ్మం అర్బన్ పార్కును 15 డిసెంబరు 1977లో జీవో ఎంఎస్ నెంబర్ 945తో నిర్మాణం చేశారు. వెలుగుమట్ల రిజర్వ్ సర్వే నెంబర్ 183లో 269.32 ఎకరాలు, చింతకాని మండలం కొదుమూరు సర్వే నెంబర్ 534లో 276.08 మొత్తం 546 ఎకరాలతో రిజర్వ్ ఫారెస్టుతో ప్రారంభించారు. అయితే 2012నుంచి 2015వరకు జరిగిన భూ పోరాటాలు, తర్వాత జరిగిన భూ పంపిణీలో 534 సర్వే నెంబర్‌లోని 30 ఎకరాలు మినహా మిగిలిన భూమిని పుట్టకోట, రుద్రంకోట, కొదుమూరు, ఇతర గ్రామాల రైతులు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత ప్రభుత్వం వారికి పట్టాలిచ్చింది. అటవీశాఖ బీట్ ఆఫీసర్ మేడగుర్తి రమేశ్ ఆధ్వర్యంలో 2010 నుంచి 2015 వరకు స్థానిక రైతుల్ని ఎదుర్కొని దెబ్బలు తిని మరీ పార్కును రక్షించటంతో ప్రస్తుతం పార్కు 300 ఎకరాల విస్తర్ణంలో సంరక్షించబడింది. దాని లో 269 ఎకరాల వరకు చైన్ లింక్ ద్వారా హద్దులు ఏర్పాటు చేశారు. ఈనెల 15నుంచి 48వ వసంతంలోకి వెళ్లింది. 3.3.2016న నాటి కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆనంద్ మోహన్ వెలుగుమట్ల నందనవనంగా నామకరణం చేశారు. తర్వాత వచ్చిన అధికారులు ఆ పేరును మరిచిపోయారు. ఇటీవల తిరిగి అర్బన్ పార్కుగా అధికారులు ప్రచారం కల్పించారు.

రూట్ మ్యాప్

ఖమ్మం కలెక్టర్ కార్యాలయానికి 3కి.మీ దూరంలో, హైదరాబాద్, రాజమండ్రి జాతీయ రహదారికి వెలుగుమట్ల ప్రాంతంలో 1.5 కి.మీ దూరంలో రవాణా సౌకర్యాలకు అందుబాటులో ఉంది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోనే కొనసాగుతోంది.

ప్రత్యేకతలు

తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద పార్కుగా ఖ్యాతి పొందింది. ఖమ్మం అర్బన్ పార్కులో ఆధునిక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా గుర్తింపు పొందింది. పూల మొక్కలతో పాటుగా భారీ వృక్షాలు, ఔషధ వృక్షాలు, మొక్కలు, సఫారి వాహన టూర్ వాహనాలు, సైక్లింగ్, జిమ్, వాకింగ్ ట్రాక్‌లు, యోగా షెడ్లు, పిల్లల పార్కులు, యడ్వేంచర్ గేమ్స్ జింకల పార్కు, రాశి వనం, హైటెక్ నర్సరీ, ఓపెన్ లాన్, వాచ్ టవర్, పగోడా, రిఫ్రెష్‌మెంట్ జోన్‌లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, యువకులు, అటవీ పరిశోధకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో ప్రతి రోజు ఖమ్మం అర్బన్ పార్కులో పర్యటిస్తున్నారు.

రూ.3 కోట్ల నిధులు మంజూరు

2016లో నాటి ఎమ్మెల్యేగా తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం అర్బన్ పార్కులో మొక్కలు నాటించి పార్కు అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా ఉన్న ఆయన ప్రత్యేక చొరవతో ఖమ్మం అర్బన్ పార్కుకు రూ.3కోట్లు నిధులు మంజూరు చేయించారు. పార్కు ఆధునీకరణ పనులు చేపట్టనున్నారు.

రాష్ట్ర స్థాయిలోనే పర్యాటక కేంద్రంగా.. సిద్దార్ధ విక్రమ్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

మంత్రి తుమ్మల చొరవతో గతంలో పార్కు అన్యాక్రాంతం నుంచి సంరక్షించాం. ప్రతి రోజు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి వెయ్యి మంది వరకు విద్యార్థులు పర్యటిస్తున్నారు. ప్రజల ఆదరణ బాగా ఉంది. ఇప్పటికే రహదారులకు రూ.2 కోట్లు, పార్కు అభివృద్ధికి మరో రూ.3కోట్లు నిధులు మంజూరు జరిగాయి. ప్రకృతికి విఘాతం కలగకుండా అటవీ పార్కు నిర్వహణ కొనసాగుతోంది. త్వరలో జూని అందుబాటులోకి తీసుకొస్తాం.



అటవిని తలపిస్తున్న పార్కు



2015లో తొలి హరితహారంలో పార్కు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పిల్లలతో మాట్లాడుతున్న భట్టి

ఎలా చదువుతున్నారు...

చిన్నారులతో భట్టి మాటామంతి

చింతకాని, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఎలా చదువుతున్నారని... కష్టపడి చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చిన్నారులతో ముచ్చటించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం బుధవారం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బందెల నాగార్జున ఇంట్లో మండల ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రిని చూడటానికి వచ్చిన చిన్నారులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, వసతులు, విద్యాబోధన... పలు అంశాలపై చిన్నారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చింతకాని మండల కేంద్రం నుంచి నరసింహపురం గ్రామం వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని, డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, పాతర్లపాడు గ్రామం వరకు ఉన్న రహదారిని రెండు లైన్ల రోడ్డుగా మార్చాలని మండల కమిటీ నాయకులు ఉపముఖ్యమంత్రి భట్టికి విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



నర్సిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

సమగ్రశిక్ష ఉద్యోగులు, సీఆర్టీలకు టైం స్కేల్ ఇవ్వాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టైం స్కేల్, ఉద్యోగ భద్రత కలిపించాలని సమ్మె చేస్తున్న కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్రశిక్ష సిబ్బంది, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్టీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావా దుర్గాభవాని మాతృమూర్తి రాజ్యలక్ష్మి అంత్యక్రియల్లో పాల్గొనడానికి ఖమ్మం వచ్చిన సందర్భంగా సీఆర్టీలు, కేజీబీవీ, సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎమ్మెల్సీ నర్సిరెడ్డిని కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయాల్సిందిగా కోరారు. నర్సిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న శాసనమండలి సమావేశాల్లో మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ స్కూల్స్‌లో ప్రవేశపెట్టిన డిటెన్షన్ విధానం, దానికి మూలమైన జాతీయ విద్యావిధానం 2020ని రద్దుచేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనివల్ల వెనకబడిన బడుగు, బలహీనవర్గాల పిల్లలు విద్యకు దూరమవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు జీవీ నాగమల్లేశ్వరరావు, షమీ, బానోత్ రామదాసు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తికి.. అరుణ 'వంద'నం

(5వ పేజీ తరువాయి)

సమస్యలపై పోరాటాలు చేసింది. పీడిత, తాడిత, శ్రమ జీవులు, రైతు, విద్యార్థి, యువజన సమస్యలపై నిర్విరామ పోరాటాలు కొనసాగించింది. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన భూ పోరాటాలతో కొన్ని లక్షల ఎకరాల భూముల పంపిణీ జరిగింది. భూ సంస్కరణల చట్టం ప్రభుత్వ అజెండాలోకి వచ్చింది. నాగార్జునసాగర్ కాల్వ నిర్మాణం, దుమ్ముగూడెం ప్రాజెక్టు ద్వారా సాగు నీటి వినియోగం కోసం సీపీఐ పోరాటాలు చేసింది. బయ్యారం ఉక్కు ఖనిజాన్ని అక్రమంగా ఏపీకి తరలిస్తున్నారని పోరాటాలు చేయటంతో ఉమ్మడి తెలుగురాష్ట్రంలో దాని లీజు రద్దయ్యింది. భద్రాచలంలో గిరిజనులు కోసం ప్రత్యేకంగా ఐటీడీఏ ఏర్పాటుకు ఉద్యమాలు జరిగాయి.

1994లో నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు

ప్రజాఉద్యమాలతో పాటుగా ఎన్నికల సమయంలో రాజకీయ ఎత్తుగడల్లోనూ సీపీఐ తన సత్తా చాటింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు సీపీఐ అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు గెలుపొంది చట్టసభల్లో ప్రజాప్రాతినిధ్యం వహించింది. ఒకటి రెండు అసెంబ్లీలు ఎన్నికలు మినహా ప్రతి అసెంబ్లీలోనూ సీపీఐ ఎమ్మెల్యేలు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కొనసాగారు. ఈ క్రమంలోనే 1994 అసెంబ్లీలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ, రాజ్యసభ స్థానాల్లో సీపీఐ ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారు. సుజాతనగర్ ఎమ్మెల్యేగా రజబ్‌అలీ, ఖమ్మం ఎమ్మెల్యేగా పువ్వాడ నాగేశ్వరరావు, ఇల్లెందు ఎమ్మెల్యేగా ఊకే అబ్బయ్య, బూర్గంపాడు ఎమ్మెల్యేగా కుంజా బిక్షం, భద్రాచలం ఎంపీగా సోడే రామయ్య, ఖమ్మం రాజ్యసభ సభ్యులుగా నల్లమల గిరిప్రసాద్ తర్వాత ఏకకాలంలో పనిచేశారు. తాజాగా కొత్తగూడెం ఎమ్మెల్యేగా కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఖమ్మం వేదికగా వందేళ్ల ఉత్సవాలు

చరిత్రాత్మకమైన సీపీఐ వందేళ్ల ఆవిర్భావ సభకు ఖమ్మం వేదికైంది. వందేళ్ల ఉత్సవాల కోసం సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా సమితి ఆధ్వర్యంలో ఖమ్మం నగరాన్ని సీపీఐ తోరణాలు, ఎర్ర జెండాలతో అలంకరించారు. స్వాగత ఫెక్సీలు, అమరవీరుల చిత్రపటాలను ఏర్పాటు చేశారు.

వందమంది రెడ్‌షర్ట్ వలంటీర్లతో నగరంలోని జెడ్పీసెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రజానాట్యమండలి డప్పు, కోలాట నృత్యాలు, కార్యకర్తల ప్రదర్శనలతో ఈ ర్యాలీ భక్తరామదాసు కళాక్షేత్రానికి చేరనుంది.

అక్కడ నిర్వహించే ఆవిర్భావ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, బాగం హేమంతరావు, జిల్లా సమితి సభ్యులు ప్రసంగించనున్నారు. వందేళ్ల ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించేందుకు సభలో కార్యచరణ రూపొందిస్తారు. ప్రజాసమస్యలపై పోరాటాలు, సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో సీపీఐ చేపట్టే ఉద్యమకార్యాచరణపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు.



కొత్తగూడెం ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



ఖమ్మంలో ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ ప్రార్థనలు

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు క్రిస్మస్ ప్రార్థనల్లో హాజరై కేక్‌ను కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం సేయింట్ ఆండ్రూస్ చర్చి, రామవరం, రుద్రంపూర్ తదితర చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రీస్తు బోధనలు విశ్వమానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం తెల్లవారుజామున మధిర మండలం బయ్యారం ఆర్‌సీఎం చర్చిలో ఆయన ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ విశ్వమానవులకు ప్రేమ, సౌభ్రాతృత్వం పంచిన ఏసుక్రీస్తు మార్గం ప్రతి ఒక్కరికి అనుసరణీయమన్నారు. అన్నిమతాల ప్రజల అభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం చర్చి పాదర్‌లు భట్టి విక్రమార్కను శాలువాతో సన్మానించారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, హస్తకళ చైర్మన్ నాయుడు సత్యం, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రంగా హన్మంతరావు, కర్నాటి రామారావు, దారా బాలరాజు, శ్రీనివాసరెడ్డి, సూరంశెట్టి కిషోర్ పాల్గొన్నారు.

ఖమ్మం సీఎస్ఐ చర్చి వేడుకల్లో మంత్రి తుమ్మల

క్రిస్టియన్, మైనార్టీల సర్వోతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంనగరం చర్చికాంపౌండ్‌లోని సీఎస్ఐ చర్చిలో బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, సహనం, శాంతి, త్యాగం, సేవాభాగంతో సమాజం ఎదగాలని ఆకాంక్షించారు. ప్రపంచశాంతి కోసం ప్రాణాలను అర్పించిన యేసుక్రీస్తు అందరికీ ఆదర్శనీమయన్నారు. ప్రార్థనల్లో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు సాధు రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిర్చికి తెగుళ్ల ముప్పు

- అకాల వర్షమే కారణం
- 30 వేల ఎకరాలకు పైగా సాగు

చర్ల, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షం మిర్చి పంటకు తీవ్ర నష్టాన్ని మిగిల్చేలా కనిపిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం వర్షం కురిసింది. మిరప పంట పూత దశలో ఉన్న క్రమంలో వర్షం పడటంతో పంటకు తెగుళ్లు వ్యాపించే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రైతులు మిర్చి సాగు చేసి తీవ్రంగా నష్ట పోయారు. పెట్టుబడి కూడా రాక అప్పుల పాలయ్యారు. ఈ ఏడాది అయినా అప్పులు తీర్చుకోవాలని ఎంతో ఆశతో పంటను సాగు చేశారు. ఈఏడాది ఇప్పటి వరకు పంటలకు ఎలాంటి తెగుళ్లు వ్యాపించలేదు. మొక్కలు పూత దశలో ఉన్నాయి. ఈ క్రమంలో వర్షం కురిస్తే ఆకు మచ్చ తెగులు వ్యాపించే అవకాశం ఉంది. మొక్కలకు ఉన్న పూత కొంత వరకు రాలి పోయింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో పైగా మిర్చి పంటను రైతులు సాగు చేశారు. భద్రాచలం డివిజన్‌లోని చర్ల, దుమ్ముగూడెం జిల్లాలో సాగు అధికంగా ఉంటుంది. ప్రతీ ఏడాది రెండు మండలాల్లో కలిపి 12 వేల ఎకరాలకు పైగా పంటను పండిస్తారు. ఈఏడాది ప్రతీ రైతులు కవులు కలుపుకొని ఎకరాకు రెండు లక్షకు పైగా ఖర్చు చేశారు. సొంత భూమి ఉన్న వారు రూ. 1.50లక్షలు ఖర్చు చేశారు.

మిర్చి పంట సాగు చేసిన రైతులు గత రెండు సంవత్సరాలుగా నష్ట పోతున్నారు. రెండు సంవత్సరాల క్రితం దోమపోటుతో చేతికి వచ్చిన పంట కళ్ల ముందే దెబ్బతింది. కనీస పెట్టుబడి కూడా రాక రైతులు కుదేలయ్యారు. గత ఏడాది మద్దతు ధర లేక, ఎండు తెగుళ్ల వ్యాపించి రైతులు పంటను కోల్పోయారు. ఈ దెబ్బలతో ఈ ఏడాది సుమారు 5వేల ఎకరాల్లో సాగు తగ్గినట్లు తెలుస్తోంది. ఈఏడాది కూడా ఇదే పరిస్థితి ఉంటే రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారనుంది. ఉద్యాన వన శాఖ అధికారులు స్పందించి రైతులకు సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో బుధవారం కురిసిన వర్షానికి మిర్చి పూత రాలిపోయింది. చర్ల మండలంలోని కొరెగడ్డ, మొగళ్లపల్లి, జీపీపల్లి, వీరాపురం పంట నష్టం ఎక్కువ ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.



గొమ్ముగూడెంలో మిర్చి తోట

చిరు జల్లులతో రైతుల్లో గుబులు

- గన్నీసంచులు లేక...కాంటాలు కాక...
- కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

అశ్వాపురం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపాక సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరతతో నాలుగు రోజులుగా కాంటాలు నిలిచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మొన్నటి వరకూ ప్యాడీ క్లీనర్లు లేక అవస్థలు పడిన రైతులకు గన్నీ బ్యాగులు సకాలంలో కొనుగోలు కేంద్రాలకు చేరక సతమతమవుతున్నారు. దీనికి తోడు గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతం అయి ఉండటమేకాక, చిరుజల్లులు పడుతుండటతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో వరికోతలు దాదాపు పూర్తి కావటంతో వేలాది క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉంది. తేమశాతం కోసం రైతులు రోజుల తరుబడి ధాన్యం ఆరబెట్టుకుంటున్నారు. ఈనేపథ్యంలో చిరుజల్లులు రైతన్నకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా తుమ్మలచెరువు ఆయకట్టుకింద సుమారు 7వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. దీంతో 2లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం దిగుబడి అయ్యింది. ధాన్యం అంతా ఆయకట్టు పరిధిలోని మొండికుంట, టీజీ కొత్తూరు, రామచంద్రాపురం, నెల్లిపాక, మల్లెలమడుగు, ఆనందాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరింది. కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యంలో సగం కాంటాలు కాగా ఇంకా లక్ష క్వింటాళ్ల వరకు ధాన్యం నిల్వ ఉంది. ఈతరుణంలో జల్లులు పడుతుండటంతో రైతులు చేతికి వచ్చిన పంట వర్షం పాలు అవుతుందేమోనని ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు కూడా అందుబాటులో లేకపోవటం రైతులకు అశనిపాతంగా మారింది. ధాన్యంపై పరదాలు కప్పుకుని కరుణించాలని వరుణదేవుని కోరుకుంటున్నారు.



అశ్వాపురంలో కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం

తాటిపూడిలో చోరీ

వైరా, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపూడి గ్రామంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడ్డారు. నల్లమోతు రామయ్య అనే వ్యక్తి ఇంట్లో చోరీకి పాల్పడిన రూ.రెండులక్షల నగదు, బంగారు చెవిదిద్దులు అపహరించుకుపోయారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామయ్య వారంరోజుల కిందట వెంకటగిరి, ఖమ్మంలో ఉన్న తమ కుమార్తెల ఇళ్లకు వెళ్లారు. బుధవారం సాయంత్రం తాటిపూడిలోని తమ ఇంటికి చేరుకున్నారు. ఆసమయంలో ఇంటి వెనుక తలుపు గడియ విరగగొట్టి ఉన్న విషయం కన్పించింది. ఆవెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా ఉన్నాయి. తాము దాచి ఉంచిన రూ.రెండులక్షల నగదు, బంగారు చెవిదిద్దులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు వైరా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

31న బహిరంగ వేలంపాట

ఏన్కూరు, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): నాచారం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తులు సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునేందుకు బహిరంగవేలం పాటను నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్.శేషయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31న మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు ఖమ్మంలోని దేవాదాయ కమిషనర్ ఖమ్మం కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు వేలంలో పాల్గొనాలని, వివరాలకు 63054 39495 నెంబరులో సంప్రదించాలన్నారు.

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

- ప్రజాపాలనలో 3,57,869 దరఖాస్తులు
- ఇప్పటి వరకు 2,19,224 దరఖాస్తుల సర్వే

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల సర్వే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలో 21 మండలాలతో పాటు ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా మునిసిపాలిటీల్లోనూ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా గత ఏడాది నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మొత్తం 3,57,869 దరఖాస్తులు అందాయి. వీటిలో ఇప్పటి వరకు 2,19,224 దరఖాస్తుదారులను అధికారులు, సిబ్బంది కలిశారు. ఈనెలాఖరు నాటికి సర్వే పూర్తి చేయనున్నట్లు సమాచారం. డిసెంబర్ నెలలో సెలవులు, కొత్త సంవత్సరం లాంటి కారణాలతో లబ్ధిదారులను కలవడం, వారి నుంచి పూర్తి సమాచారం సేకరించడం మరికొన్ని రోజులు జాప్యం జరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు భావిస్తున్నారు.

వివరాలు ఇలా నిక్షిప్తం

సర్వే ప్రక్రియలో అధికారులు, సిబ్బంది ఒక్కొక్కరు కనీసం 500-700 వరకు దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్నారు. ముఖ్యంగా అధికారులు యాప్ వివరాలు నమోదుచేయడం వరకు మాత్రమే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తిరిగి లబ్ధిదారుల ఎంపిక తర్వాత ప్రక్రియలో ఉంటుందన్నారు. యాప్‌లో అర్హత పొందిన, దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుని వివరాలు నమోదు చేస్తున్నారు. సొంత స్థలముందా? ఉంటున్న ఇల్లు రేకులతో ఉందా? స్లాబ్ ఇల్లా? స్థలం ఉంటే ఎక్కడుంది? సంబంధిత పత్రాలు తీసుకొని వివరాలు నమోదుచేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఏదైనా లబ్ధి పొందారా ఏం పనిచేస్తున్నారు లాంటి వివరాలను నమోదు చేస్తున్నారు.

ఈ నెలాఖరు నాటికి సర్వే పూర్తి గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాస్



డిసెంబరు నాటికి జిల్లాలో ఇందిరమ్మ ఇంటికోసం సర్వే పూర్తి చేస్తామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 2,19,224 ఇళ్లను సర్వే చేశాం. 58శాతంపూర్తయింది. ప్రజాపాలనలో మిస్సయిన దరఖాస్తుల వారి నుంచి కూడా వివరాలు కూడా సేకరిస్తున్నాం. సర్వే పూర్తయిన తర్వాత అర్హులైన వారికీ సర్వేలో అవకాశం కల్పించనున్నాం. యాప్‌లో వివరాల ఆధారంగానే లబ్ధిదారులను ప్రాధాన్యం ప్రకారం ఎంపిక చేస్తాం. ఆ తర్వాత గ్రామసభలో ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక చేసి తుది ఎంపిక జరుగుతుంది.



ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాపాలన దరఖాస్తుల సర్వే వివరాలు ఇలా

నియోజకవర్గం	దరఖాస్తులు	సర్వే అయినవి	శాతం
ఖమ్మం	70,320	39,988	53.61
పాలేరు	70918	43613	57.13
మధిర	69917	46010	62.85
వైరా	68582	44037	61.36
సత్తుపల్లి	78132	45576	55.47
మొత్తం	3,57,869	2,19,224	58.00

ఆనంద సాగరం

- ఆశాజనకంగా శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నీటిమట్టం
- ముమ్మరంగా యాసంగి సాగు
- పొదుపుగా వాడుకుంటే వచ్చే సీజన్‌కు కూడా నీరు



కూసుమంచి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లో నీటిమట్టాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈఏడాది ఆగస్టులో వచ్చిన వరదలకు ఎగువన ఉన్న జలాశయాలు నిండి దిగువకు భారీగా వరదలు రావడంతో కొద్ది రోజుల్లోనే సాగర్ నిండింది. తర్వాత సైతం వరదలు కొనసాగడంతో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. వానాకాలం పంటలు పూర్తయినా నీటి నిల్వలు తగ్గకపోవడంతో వచ్చే వానాకాలం పంటలకు భరోసా కలుగుతోంది. నీటిని ఇలాగే ఉంచితే వచ్చే ఏడాది వానాకాలంకు ముందస్తుగానే నీటివిడుదల చేపట్టి నాట్లు పూర్తి చేసుకోవచ్చని రైతులు అభిప్రాయపడున్నారు.

ఆశాజనకంగా నిల్వలు

సాధారణంగా నైరుతి రుతుపవనాలు వ్యాపించిన సమయంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు పడి అల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం జలాశయాలు నిండుతాయి. తాగునీటి అవసరాలు తీరిన అనంతరం దిగువకు వదులుతుంటారు. అక్టోబరులోనూ వరదలు రావడంతో తాగునీటి అవసరాలు పోను నీటిని సముద్రంలోకి వదిలారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 590 అడుగులు. కాగా ప్రస్తుతం 587 అడుగులమేర నీరు నిల్వ ఉంది. అంటే 305 టీఎంసీలు. శ్రీశైలం జలాశయం885 అడుగులకుగానూ ప్రస్తుతం 868 అడుగుల మేర నీరు నిల్వ ఉంది. విద్యుతుత్పత్తి ద్వారా కొంత నీరు సముద్రంలో కలుస్తోంది. దాన్ని నిలువరించగలిగితే చాలావరకు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గే అవకాశం లేదు.

ప్రస్తుతం నీటినిల్వలు రెండుపంటలకు సరిపోతాయని నీటిపారుదలశాఖ అధికారులు అంచనా వేశారు. నీటిని పొదుపుగా వడుకోవడంతోపాటు రాజకీయాలకు అతీతంగా విద్యుతుత్పత్తి, కుడి, ఎడమకాల్వకు కేటాయింపులు, నీటివిడుదల... అన్నింటినీ క్రమ పద్ధతిలో వాడుకుంటే నీటినిల్వలు తగ్గకుండా జాగ్రత్త పడవచ్చని సూచిస్తున్నారు. ఒకవేళ వచ్చే వానాకాలంలో సరైన సమయంలో వర్షాలు రాకపోయినా సకాలంలో నీరువిడుదల చేసుకుని పంటలు సాగుచేసుకోవచ్చని అధికారులు, రైతులు చెబుతున్నారు. యాసంగి పంటకు సరిపడా వాడుకున్నా వానాకాలం పంట వరకు 560 అడుగుల మేర నీరు నిల్వ ఉంటే ఒకపంటకు నీరు సరిపోతుంది.



ముమ్మరంగా యాసంగి వరినాట్లు

ముమ్మరంగా యసంగి నాట్లు

వానాకాలం పంట కోతలు పూర్తి అయిన ప్రాంతాల్లో యాసంగి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఈఏడాది సరైన సమయంలో వర్షాలు రావడంతో వానాకాలం పంట పూర్తయింది. అనంతరం ఇప్పుడు యాసంగి సాగులో రైతులు బిజీ అయ్యారు. ఖమ్మం జిల్లాలో 2.54 లక్షల ఎకరాల్లో వరిసాగవుతుంది.

క్రైం సమాచారం

తాళం పగుల గొట్టి బంగారం చోరీ

ఖమ్మంక్రైం, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): తాళం పగులగొట్టి బంగారం, నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నగరంలోని బ్యాంకుకాలనీ-2లో నివాసం ఉంటున్న వెంగల స్వరూప్ కుటుంబసభ్యులతో కలిసి సోమవారం హైదరాబాదు వెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి ఇంటికి వచ్చిచూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపల చూడగా 12తులాల బంగారం, రూ.80వేలు నగదు కనిపించలేదు. బాధితుడు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. విషయం తెలిసిన పోలీసులు చేరుకుని ఆధారాలు సేకరించినట్లు సమాచారం.

గుండెపోటుతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి



చింతకాని, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో చింతకాని ఎంపీడీవో కార్యాలయం గ్రామపంచాయతీ క్లస్టర్ కంప్యూటర్ ఆపరేటర్ (ఔట్ సోర్సింగ్) బుద్దా ప్రదీప్‌కుమార్ (35) బుధవారం మృతిచెందారు మంగళవారం సాయంత్రం ప్రదీప్‌కు ఒంట్లో నలతగా ఉండటంతో బంధువులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా బుధవారం ఉదయం అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతిచెందాడు. ఎంపీడీవో రామయ్య, ఎంపీవో పర్వీన్ కైసర్, కంప్యూటర్ ఆపరేటర్‌లు సుమంత్, రాజు, ప్రశాంత్, కార్యదర్శులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో మేకల వ్యాపారి మృతి



బూర్గంపాడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొట్టిన ఘటనలో మేకల వ్యాపారి మృతి చెందాడు. ఈ విషాద ఘటన బుధవారం మోరంపల్లిబంజరలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన పులి నారాయణ(55) అనే వ్యక్తి మేకల వ్యాపారం, చికెన్‌షాపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అదే గ్రామంలో తాను ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ట్రాలీ ఆటో బలంగా ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంసభ్యులు క్షతగాత్రుడిని భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు. కాగా ఐదు నెలల క్రితం పెద్ద కుమారుడు శేఖర్ మృతి చెందాడు. కొడుకు మరణాన్ని జీర్ణించుకునేలోపే కుటుంబ పెద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఆ కుటుంబానికి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపు నొప్పి తాళలేక విద్యార్థిని బలన్మరణం

కామేపల్లి, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక విద్యార్థిని బలన్మరణానికి పాల్పడ్డ సంఘటన కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పండితాపురం గ్రామానికి చెందిన దండుగుల ఉమ(17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. నొప్పిని తట్టుకోలేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొన్నది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందింది. ఈ ఘటనపై కామేపల్లి పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసినట్లు ఆమె తల్లి కనకమ్మ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడులు

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): కోడిపందాల స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని తిరుమలకుంట సమీపంలో కొందరు కోడిపందాలు నిర్వహిస్తున్నారు. సమాచారం మేరకు ఎస్‌ఐ యాయాతిరాజు తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో రూ.1700 నగదును, మూడు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ముగ్గురును దొరకగా మరికొందరు పారిపోయారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాయాతిరాజు వివరించారు.

నగరంలో చైన్ స్నాచింగ్

ఖమ్మం క్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని పారిపోయిన సంఘటన బుధవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని పోలీస్ కాలనీలో అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి అప్పటికే అతడు అక్కడినుంచి పారిపోయాడు. స్థానికులు ఖానాపురం హవేలి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చొప్పకట్లపాలెంలో నేత్రదానం

బోనకల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన కలవల వెంకటేశ్వర్లు(85) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. తాను మరణించిన తరువాత నేత్రాలను దానం చేయాలన్నది ఆయన ఆశయం. దీంతో ఖమ్మం నేత్రనిధికి కుటుంబ సభ్యులు నేత్రాలను దానం చేశారు. మరణించి మరొకరి జీవితంలో కంటి వెలుగులను ప్రసాదించినందుకుగానూ పలువురు ఆయన ఆశయాలను కొనియాడారు. సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు చేడే వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ బాణోతు కొండ, రంగా నాగేశ్వరరావు, పల్లపోతుల గోపాలరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, రంగా జనార్ధన్‌రావు, వెచ్చా సీతారాములులు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగ అరెస్టు

- జల్సాలకు అలవాడు పడి చోరీలు
- 9 ద్విచక్ర వాహనాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ, ఎస్‌ఐ

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): జల్సాలకు, మద్యానికి అలవాడు పడి ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న అంతరాష్ట్ర దొంగను అశ్వారావుపేట పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ కరుణాకర్, ఎస్‌ఐ యాయాతిరాజు వివరాలను వెల్లడించారు. అశ్వారావుపేట పట్టణంలోని దండాబత్తుల వీధికి చెందిన సరిపల్లి నరసింహారాజు అనే వ్యక్తి బుధవారం ఉదయం భద్రాచలం రోడ్ వైపు నుంచి అశ్వారావుపేటకు వస్తుండగా ఎస్‌ఐ యాయాతిరాజు తన సిబ్బందితో తనిఖీలు చేస్తూ వాహనాన్ని ఆపారు. అయితే నరసింహారాజు పారిపోతుండగా పట్టుకుని విచారించగా మోటార్ సైకిల్‌ను దొంగిలించినట్లు తెలిపాడు. అనంతరం నరసింహారాజును అదుపులోకి తీసుకుని విచారించగా జల్సాలకు అలవాడు పడి రెండు తెలుగు రాష్ట్రాల్లో తొమ్మిది వాహనాలను దొంగిలించినట్లు తెలిపాడు. మద్యానికి డబ్బుల కోసం వాహనాలను తక్కువ ధరకు అమ్మినట్లు తెలిపాడని పోలీసులు వివరించారు. దొంగిలించిన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని అంతరాష్ట్ర దొంగ నరసింహారాజును అరెస్టు చేసినట్లు వివరించారు. ఇవే కాకుండా సామర్లకోటలో 2022లో కూడా ఒక దొంగతనం కేసు నమోదు అయినట్లు సీఐ కరుణాకర్ వివరించారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు

ధాన్యం లారీ బోల్తా

కారేపల్లి, డిసెంబరు 25: (ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం జోగూడెం గ్రామంలోని ఐకేపీ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వరి ధాన్యం లోడుతో వెళుతున్న లారీ కారేపల్లి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డువద్ద అదుపుతప్పి బోల్తాపడింది. జోగ్గూడెంలో లారీలో ధాన్యం లోడు వేసుకుని ఖమ్మం నగరంలోని మిల్లుకు వెళుతున్న సమయంలో బోల్తా పడింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ అద్దం పగలకొట్టుకుని బయటకు వచ్చారు. భయంతో వారు పరారయ్యారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



ఈవోకు నగదు అందిస్తున్న జయదీప్

ఎర్రుపాలెం, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం రూ.లక్ష నూట పదహారులను ఓ భక్తుడు ఈవో కె.జగన్మోహణరావుకు అందించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కృష్ణలంకకు చెందిన చెరుక జయదీప్, ప్రీతి దంపతులు శ్రీవారి నిత్య అన్నదనా పథకం విరాళంగా అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే శ్రీవారి దర్శనానికి వచ్చే వారి ఆకలి తీర్చే నిత్యన్నదాన పథకానికి విరాళం ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈవో జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ఆలయంలో జరిగే శాశ్వత నిత్యన్నదానపథకానికి విరాళం ఇచ్చిన నగదును దేవస్థానం బ్యాంకు ఖాతాలో జమచేసి దానిపై వచ్చేవడ్డీతో భక్తులకు ఉచిత అన్నదానం చేస్తామన్నారు. ఈసందర్భంగా దాత దంపతులకు శ్రీవారి శేష వస్త్రములు, ప్రసాదములు అందించారు ఈకార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కే.విజయకుమారి, దేవాలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నేత ఏపూరి మృతి

- నివాళులర్పించిన కొత్తగూడెం, ఇల్లెందు ఎమ్మెల్యేలు





నివాళులర్పిస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ఇల్లెందు టౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మికసంఘం ఉపాధ్యక్షుడు ఏపూరి బ్రహ్మం(68) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇల్లెందు పట్టణంలోని ఆయన స్వగృహంలో మృతిచెందగా సమాచారం తెలుసుకున్న ఇల్లెందు, కొత్తగూడెం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్యా పద్మ, జిల్లా నాయకులు బొల్లోజు అయోధ్య చారి, కే. సారయ్య, బందం నాగయ్య, మిర్యాల నాగయ్య, దేవరకొండ శంకర్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేలు గుమ్మడి నర్సయ్య, బాణోత్ హరిప్రియ, టీడీపీ నాయకులు ముద్రగడ వంశీ, రమేష్‌బాబు, బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు డానియేలు, సుదర్శన్‌కోరి, జానీ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ఏజే. సురేష్, అన్నవరపు కనకయ్య, అబ్దుల్ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, న్యూడెమోక్రసీ నాయకులు జే. సీతారామయ్య తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ జిల్లాలో బలమైన నాయకుడిగా పని చేసిన ఏపూరి బ్రహ్మం మృతి ప్రజారైతు ఉద్యమాలకు తీరని లోటన్నారు. ప్రత్యేకంగా ఇల్లెందు నియోజకవర్గంలో సీపీఐ బలోపేతం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. సింగరేణి కార్మికుడిగా పని చేస్తూ కార్మికుల హక్కుల సాధనలో ముందున్నారని ప్రశంసించారు. ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మంత్రి తుమ్మలకు ఆహ్వానం అందిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిలో రామకృష్ణ, వివేకానంద భావప్రచార పరిషత్ భక్త సమ్మేళనం

- 28, 29తేదీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహణ
- ప్రత్యేక ఆహ్వానితులుగా మంత్రులు తుమ్మల, పొంగులేటి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28, 29వ తేదీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయిలో రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనం సత్తుపల్లిలోని మాధురి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కలిసిన నిర్వాహకులు సమ్మేళనానికి రావాల్సిందిగా బుధవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మహారాజ్, ఇతర స్వామిజీలు, మాతాజీలు హాజరుకానున్నట్లు తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు తదితర ప్రముఖులు హాజరవుతున్నారన్నట్లు చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసులు తెలిపారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సమ్మేళనంలో మొదటి రోజు విద్యార్థులలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు వివేకానంద-రామకృష్ణ భావజాలాన్ని నింపేందుకు పాఠశాల స్థాయిలో విద్యార్థి సమ్మేళనం, యువజన సమ్మేళనం జరుగనుంది. రెండో రోజు తెలుగురాష్ట్రాలలోని రామకృష్ణ-వివేకానంద సేవా సంస్థల నిర్వాహకులు, భక్తులు హాజరవ్వనున్నారు.

దేశం కోసమే వాజపేయి నిర్ణయాలు

- ఘనంగా శతజయంతి వేడుకలు

ఖమ్మం బైపాస్‌రోడ్, డిసెంబరు25 (ఆంధ్రజ్యోతి): ప్రధానిగా వాజపేయి దేశాభివృద్ధికోసమే అనేక నిర్ణయాలు తీసుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. మాజీప్రధాని అటల్‌బీహారీ వాజ పేయి శతజయంతి సందర్భంగా నగరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఇతర నాయకులతో కలిసి వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా దేశఖ్యాతిని పెంచేందుకు వాజపేయి అనేక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. దేశం అంటే అతి పెద్ద ప్రజాఆస్వామ్య దేశమని నిరూపించిన మహానేత అని కొనియాడారు. ఈసందర్భంగా వాజపేయి ఖమ్మం పర్యటన సమయంలో ఆయన నాయకత్వంలో పనిచేసిన బీజేపీ సీనియర్ నాయకులు గంటేల విద్యాసాగర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మంద సరస్వతి, శ్యాంరాథోడ్, గుగులోత్ నాగేశ్వరరావు ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, వెంకటనారాయణ యాదవ్, అనంత ఉపేంద్ర గౌడ్, చావా కిరణ్, నర్సింహారావు, దీకొండ శ్యామ్ పాల్గొన్నారు.



వాజపేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గల్లా సత్యనారాయణ, గంటేల విద్యాసాగర్

నగరంలో పర్యటించిన అంబికా కృష్ణ

- పలుదేవాలయాల సందర్శన
- ట్రస్టుల్లో శిక్షణల పరిశీలన

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంబికా దర్బార్ అధినేత, మాజీ ఎమ్మెల్యే, బీజేపీ ఏపీ నాయకుడు అంబికా కృష్ణ బుధవారం ఖమ్మం నగరంలో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన బీజేపీనేత దేవకి వాసుదేవరావుతో కలిసి నగరంలోని దేవాలయాలను, విహే, గురుదక్షిణ ఫౌండేషన్‌ను సందర్శించారు. గుట్టల బజార్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాన్ని సందర్శించి వేదపండితుల ఆశీర్వాదం పొందారు. ఈసందర్భంగా ఆయనను ఆలయ చైర్మన్ మేళ్ల చెరువు వెంకటేశ్వరరావు సంప్రదాయబద్ధంగా ఆహ్వానించడంతో పాటు శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన శ్రీనివాసనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆయనను సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన విహే, గురుదక్షిణ ఫౌండేషన్లలో ఉచిత శిక్షణ కార్యక్రమాలను పరిశీలించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చారుగుండ్ల నరసింహమూర్తి, నకిరికంటి వీరభద్రం, వీరవెల్లి రాజేష్, రాయపూడి వెంకట్, దేవతఅనిల్, బిజ్జాల ఈశ్వరరావు, చెరుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అంబికా కృష్ణను సన్మానిస్తున్న అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతినిధులు

అనాథ వృద్ధురాలికి అన్నం ఫౌండేషన్ ఆశ్రయం



వృద్ధురాలిని అన్నం ఫౌండేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న గుర్తుతెలియని వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతుండడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆశ్రయం కల్పించారు. మంగళవారం అర్ధరాత్రి డోర్నకల్‌నుంచి విజయవాడ వెళ్తున్న ఓ రైలులో 85 ఏళ్ల వయస్సున్న వృద్ధురాలు జ్వరంతో వణుకుతూ కిందపడిపోయింది. ఆమెను తోటి ప్రయాణికులు ఖమ్మం రైల్వేస్టేషన్‌లో దించారు. విషయం తెలుసుకున్న రైల్వే జీఆర్పీ ఎస్‌ఐ భాస్కర్‌రావు అన్నం శ్రీనివాసరావుకు సమాచారం అందించడంతో ఆయన రైల్వేస్టేషన్‌కు చేరుకుని వృద్ధురాలిని ఫౌండేషన్‌కు తరలించి చికిత్స అందించారు. ఆమెను వివరాలు అడగ్గా తనది విజయవాడ అని, తన పేరు శారా అని మాత్రమే చెబుతుందని పోలీసులు తెలిపారు.







రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	40
బీరకాయ	58
పచ్చిమిర్చి	38
కాకరకాయ	58
బెండకాయ	24
పొట్లకాయ	50
దోసకాయ	38-44
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	60-66
సొరకాయ	28
క్యారెట్	48
క్యాప్సికం	60
ఆలుగడ్డ	34
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	185
కొత్తిమీర కట్ట	25

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	బచ్చలమల్లి
సాయిరాం:	శ్రీకాకుళం షెర్లాక్స్ హోం
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ



వరంగల్ క్రాస్‌రోడ్డులోని చర్చిలో కేక్ కట్‌చేస్తున్న దయాకర్‌రెడ్డి

క్రిస్మస్ ఈ లోకానికి గొప్ప పర్వదినం: బిషప్ ప్రకాష్

నెట్‌వర్క్: క్రిస్మస్ వేడుక ఈ లోకానికి గొప్ప పర్వదినం అని కరుణగిరి చర్చి బిషప్ నగిలి ప్రకాష్ అన్నారు. మండల పరిధిలోని కరుణగిరిలో బుధవారం జరిగిన వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు ఈ లోకానికి రక్షణ ఇవ్వడానికి వచ్చారని తెలిపారు. ఆయన ధనవంతుడై ఉండి దీనులకోసం భూమిపై జన్మించాడన్నారు. క్రిస్మస్ ఈ లోకానికి గొప్ప పర్వదినం అన్నారు. జిల్లా వ్యాప్తంగా తెల్లవారుఝామునుంచే చర్చిలలో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారు ఝామునుంచే పవిత్ర ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు అనంతరం కేక్‌లు కట్ చేసి తమ బంధుమిత్రులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. తమ ఇళ్లల్లో విందులకు ఆహ్వానించారు. చర్చిలలో పలువురు ప్రముఖులు ప్రార్థనలు చేశారు.



ఆర్‌సీఎం చర్చిలో మంత్రి తుమ్మల ప్రార్థనలు



తిరుమలాయపాలెం మండలం ఏలువారిగూడెంలో మాట్లాడుతున్న దయాకర్‌రెడ్డి



తిరుమలాయపాలెంలో



సీఎస్‌ఐ చర్చిలో సామూహిక ప్రార్థనలు



ఖమ్మంలో బిషప్ ఊరేగింపు



కామేపల్లిలో కేక్ కట్‌చేస్తున్న తహసీల్దార్, పీఏసీఎస్ చైర్మన్



ఖమ్మం చర్చి కాంపౌండ్ ఏరియాలో..



కరుణగిరి చర్చిలో బిషప్ ప్రకాశ్ ప్రార్థనలు



ఖమ్మం ఆర్‌సీఎం చర్చిలో..



ఖమ్మం చర్చి కాంపౌండ్ ఏరియాలో..

ఏపూరి బ్రహ్మం మృతి పార్టీకి తీరనిలోటు

సీపీఐ జిల్లా నాయకుడు పుచ్చకాయల కృష్ణయాదవ్



నివాళ్లు అర్పిస్తున్న జిల్లా ఓబీసీ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం

కామేపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు, భద్రాది కొత్తగూడెం జిల్లా కార్యవర్గ సభ్యుడు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏపూరి బ్రహ్మం మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా నాయకుడు పుచ్చకాయల కృష్ణయాదవ్, సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన స్వగ్రామం కామేపల్లి మండలం ఊట్కూర్‌లో మృతదేహన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. కృష్ణయాదవ్ మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు పని చేశారన్నారు. పార్టీలో ఉంటూ ప్రజా సేవకే జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత నేత కొనియాడారు. ఆయన మృతదేహన్ని పీఏసీఎస్ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, జిల్లా సీపీఐ నాయకురాలు ఏపూరి లతాదేవి, ఫత్యే మహ్మద్, మాజీ సర్పంచ్ కొడెం సులోచన వివధ పార్టీ నాయకులు సందర్శించి నివాళ్లు అర్పించారు.

అకాలవర్షంతో అన్నదాతలకు నష్టం



రమణతండాలో వర్షానికి తడిచిన మిర్చిని ఆరబోస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో మంగళవారం, బుధవారం కురిసిన వర్షానికి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ముఖ్యంగా మిర్చిసాగు రైతులకు తీవ్ర నష్టం జరిగింది. కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంట తడిచింది. మండలంలోని రఘునాథపాలెం, కాకరవాయి, బీరోలు, తిరుమలాయపాలెం, రమణతండా, వెదుళ్లచెరువు తదితర గ్రామాలలో రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిచింది. పంటను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ధాన్యం కూడా తడిచింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి మండల సాధన కమిటీ వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాధన సమితి నాయకులు

తిరుమలాయపాలెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటుచేయాలని కోరుతూ బుధవారం బచ్చోడు మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందించారు. బచ్చోడును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని 18గ్రామపంచాయతీలు , 8మంది ఎంపీటీసీల తీర్మానంతో కూడిన వినతిపత్రం అందించారు.

ఈకార్యక్రమంలో తిమ్మిడి హనుమంతరావు, బింగి రమేష్, జక్కుల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు, తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ నగర యూనియన్ అధ్యక్షుడు మారంరాజు రాధాకృష్ణారావు సతీమణి లక్ష్మి బుధవారం మృతిచెందారు.

ఆమె మృతికి బ్రాహ్మణ సంఘంతోపాటు పురోహితసంఘం, జిల్లా సీనియర్ సిటిజన్స్ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించారు. నగరంలోని మామిళ్లగూడెంలో లక్ష్మి భౌతికకాయన్ని

సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కల్యాణం కృష్ణయ్య, వెలిగేటి చంద్రమోహన్, ఎం. సుబ్బయ్య, తాళ్లూరి వేణు, మాటూరి లక్ష్మీనారాయణ, రంగారావు, ముడుంబా శ్రీకాంత్, వాసు, సత్యనారాయణ, రామకృష్ణ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి గాను అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కల్లూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ బుధవారం ఓ ప్రకటన లో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ క్యాటగిరిలో అర్హులైన అభ్యర్థులు జనవరి నెల 1 తేదీ లోగా ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇదే నోటిఫికేషన్ లో 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్‌లాగ్ ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. 23 ఫిబ్రవరి 2025న పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

నూతన వ్యవసాయ చట్టాన్ని రద్దు చేయాలి

కల్లూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) రైతులు పండించ పంటకు మద్దతు ధర చట్టం చేయకుండా కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహారిస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు శీ లం సత్యానారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తాళ్లూరు గ్రామంలో బుధవారం సం యుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు తెలంగా ణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రాలను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో తన్నీరు కృష్ణార్జునరావు, అంజయ్య, మోదు గు వెంకయ్య, కృష్ణ, రేసు పద్మ, నాయుడు చందర్‌రావు, రాజరాములు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: భట్టి

మధిరటౌన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మధిరలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పీఆర్టీయూ స్టేట్ అసోసియేట్ మాజీ అధ్యక్షుడు బోయపాటి వెంకటేశ్వరరావుతో పాటు మధిర పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారికి ఆయన కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా చేజారకుండా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, టౌన్ అధ్యక్షుడు రమణ నాయకులు కరివేద సుధాకర్, పారుపల్లి విజయ్, శ్రీనిధి అనిల్, రంగా శ్రీను పార్టీలో చేరిన జె.వి.రెడ్డి, జగన్నాథ చారి, ఎల్వీ రెడ్డి, వినోద్, పవన్ తదితరులున్నారు.



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కేఎంసీ ఉద్యోగులకు పీఎఫ్ కష్టాలు

» 12మంది ఉద్యోగులకు నిలిచిన బిల్లుల ప్రక్రియ

» రెండు నెలలుగా మారని ఏఎంసీ డిజిటల్ సంతకం



ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయం

ఖమ్మం సంక్షేమ విభాగం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో ఉద్యోగులు, కార్మికులతో రాత్రింబవళ్లు పనులు చేయించే అధికారులు వారికి కార్మిక, ఉద్యోగ చట్టాల మేరకు రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్స్ డబ్బులు తీసుకోవటంలో మాత్రం నెలల తరబడి చుక్కలు చూపిస్తున్నారు. ఒక్కరు ఇద్దరు కాదు ఏకంగా 12 మంది ఉద్యోగులు పీఎఫ్ డబ్బులు కోసం నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఖమ్మం నగర పాలక సంస్థలో ఏర్పడింది. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సంపత్‌కుమార్ రెండు నెలల క్రితం మధిర పురపాలకానికి బదిలీ జరిగింది. ఆయన స్థానంలో అక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న షఫీ ఉల్లాను ఖమ్మం ఏఎంసీగా బదిలీ చేశారు. అయితే ఖమ్మం ఏఎంసీగా వచ్చిన షఫీ ఉల్లాకు వారం తిరగకముందే హైదరాబాద్‌కు బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. కాని బదిలీపై వెళ్లలేదు. కేఎంసీలోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కాగా అసిస్టెంట్ కమిషనర్ స్థాయిలో ఉన్న అధికారి డిజిటల్ సంతకాలతోనే పీఎఫ్ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన అప్రూవల్స్ ఆన్‌లైన్ నిర్వహణ జరుగుతుంది. రెండు నెలలైనా ఇంకా మాజీ ఏఎంసీ సంపత్‌కుమార్ డిజిటల్ సంతకాలు మాత్రమే పీఎఫ్ అమోదంలో ఉన్నాయి. దీంతో పీఎఫ్ ఖాతాలకు డిజిటల్ సంతకాలు అమోదముద్ర ఇబ్బందిగా మారింది. దీంతో 12 మంది ఉద్యోగులు, కార్మికులు వరకు పీఎఫ్ డబ్బులు తీసుకునే ఆన్‌లైన్ ప్రక్రియ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి డిజిటల్ సంతకాలు మార్పులు చేయించాలని పీఎఫ్ ఖాతాదారులు కోరుతున్నారు.

వాజపేయిని ఆదర్శంగా తీసుకోవాలి

» శతజయంతి వేడుకల్లో బీజేపీ జిల్లా నాయకుడు శీలం పాపారావు



వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శీలం పాపారావు

నేలకొండపల్లి, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నేటి యువత మాజీ ప్రధాని వాజపేయిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శీలం పాపారావు అన్నారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి వేడుకలను నిర్వహించారు. నేలకొండపల్లి పీఎస్సార్ సెంటర్లో బుధవారం నిర్వహించిన వాజ్‌పేయి శత జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వాజపేయి దేశానికి అత్యంత నీతివంతమైన పాలనను అందించారన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. వాజపేయిని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని, దేశ అభివృద్ధిలో తమ వంతు కృషి చేయాలని పాపారావు కోరారు. కార్యక్రమంలో పాగర్తి సుధాకర్, మన్నె కృష్ణారావు, షర్ఫుద్దీన్, మల్లెబోయిన గోవిందరావు, కాళంగి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కిష్టారంలో ప్రార్థనలలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



వైరా పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్



కల్లూరులో దుస్తులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



సత్తుపల్లిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

సత్తుపల్లి, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ప్రజలకు అందే పథకాలు, అవసరాలను తప్పకుండా దేవుడు మాకు ఇచ్చిన శక్తిమేరకు పనిచేస్తున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. బుధవారం సత్తుపల్లి పట్టణంతో పాటు మండలంలోని ఆయా చర్చీలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టారం చర్చీలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. అదేవిధంగా కిష్టాపురంతో పాటు పలు చర్చీలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ప్రార్థనలు చేశారు.

వైరా, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వైరా మునిసిపాలిటీ ఏడో వార్డు బ్రాహ్మణపల్లిలోని ఆర్‌సీఎం చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ ప్రార్థనలు చేసి కేక్ కట్‌చేశారు. మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, కట్ల రంగారావు, పణితి శ్రీను, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, ధార్న రాజశేఖర్ పాల్గొన్నారు.

కల్లూరు, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం కల్లూరులోని పలు చర్చిల్లో జరిగిన ప్రార్థన వేడుకల్లో సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. టీజీఎం చర్చిలో నిరుపేద మహిళలకు సండ్ర దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ ఎనోష్‌కుమార్, దయాకర్, నిర్మలకుమార్, ఏబీనేజర్, గుర్రాల సత్యానందం, కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, కాటంనేని వెంకటేశ్వరరావు, పెడకంటి రామకృష్ణ, బోబోలు లక్ష్మణరావు, కమ్లి, కొరకొప్పు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల సందర్భంగా కల్లూరు పట్టణంలోని పలు చర్చిలకు ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావులు కేక్‌లు అందజేశారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మండల పరిధిలోని పలు గ్రామాల్లో గల చర్చిలకు కేక్‌లు పంపగా వాటిని కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాగం ప్రభాకరచౌదరి, భుక్యా శివకుమర్‌నాయక్, పాపబత్తిని నగేష్, ఆళ్లా నరిసింహారావు, కుంచాల గురువయ్య పలు చర్చిల మతగురువులు పాల్గొన్నారు.

కారేపల్లి/ఏన్కూర్/చింతకాని/బోనకల్/తల్లాడ/కొణిజర్ల/ఎర్రుపాలెం, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ వేడుకలను ఆయా మండలాల్లో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కొవ్వొతులో ప్రదర్శన నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ఎర్రుపాలెంలో..



బోనకల్‌లో...



ఏన్కూర్‌లో..



కారేపల్లిలో కొవ్వొత్తులను ప్రదర్శిస్తున్న క్రైస్తవులు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

» ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిరటౌన్, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం మధిరలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పీఆర్టీయూ స్టేట్ అసోసియేట్ మాజీ అధ్యక్షుడు బోయపాటి వెంకటేశ్వరరావుతో పాటు మధిర పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన వారికి ఆయన కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో ఒక్క సీటు కూడా చేజారకుండా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమణ నాయకులు కరివేద సుధాకర్, పారుపల్లి విజయ్, శ్రీనిధి అనిల్, రంగా శ్రీను పార్టీలో చేరిన జె.వి.రెడ్డి, జగన్నాథ చారి, ఎల్వీ రెడ్డి, వినోద్, పవన్ తదితరులున్నారు.

నూతన వ్యవసాయ చట్టాన్ని రద్దు చేయాలి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి

కల్లూరు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి) రైతులు పండించ పంటకు మద్దతు ధర చట్టం చేయకుండా కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహారిస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తాళ్లూరు గ్రామంలో బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధాన పత్రాలను దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తన్నీరు కృష్ణార్జునరావు, అంజయ్య, మోదుగు వెంకయ్య, కృష్ణ, రేసు పద్మ, నాయుడు చందర్‌రావు, రాజరాములు రైతులు పాల్గొన్నారు.



నూతన వ్యవసాయ మార్కెట్ పాలసీ పత్రాలను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

» జైకిసాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారు అప్పారావు

కారేపల్లి, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జైకిసాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారు అప్పారావు సూచించారు. బుధవారం మండల పరిధిలోని మాధారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. మండలంలో రైతులు పెద్ద మొత్తంలో సాగుచేసిన 1262 రకం కలిగిన వడ్లను అధికారులు కొనుగోలచేయడం లేదని, ఈవిషయంపై జిల్లా అధికారులతో మాట్లాడాలని పలువురు రైతులు అప్పారావును కోరారు. ఈకార్యక్రమంలో అజ్మీర శారద, చంద్రకళ, కుర్ర నర్మద, వెంకటమ్మ, భారతి, లక్ష్మి, ఝున్సీ కుర్ర శ్రీను, కోయిల శ్రీను పాల్గొన్నారు.

వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

వైరా, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరాలో అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాలను బుధవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు పరిశీలించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.నాలుగున్నరకోట్ల అంచనాలతో నీటిపారుదలశాఖ స్థలాల్లో వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాలను చేపట్టారు. అయితే ఇంతవరకు పూర్తి కాలేదు. వెజ్ మార్కెట్‌లోని భవనాలు స్లాబ్ నిర్మాణాల వరకు పూర్తయ్యాయి. నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాలు మొండిగోడల దశలోనే నిలిచి ఉన్నాయి. ఎమ్మెల్యే క్యాంపు కా ర్యాలయానికి ఎదురుగా అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ నిర్మాణాలు పరిశీలించారు. అసంపూర్తి నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, అధికారులను ఆదేశించారు. టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, పణితి శ్రీను, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, చెరుకూరి కిరణ్ పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు విరివిగా చేపట్టండి'

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరమహంస, పరివ్రాజకులు, పద్మభూషణులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామిచే మండలంలోని రేజర్లకు చెందిన ప్రముఖ ప్రవచనకర్త నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామి మంగళాశాసనములు అందుకున్నారు. ధనుర్మాసం సందర్భంగా బుధవారం ఆంధ్రాలోని మంగళగిరిలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేజర్లలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం భక్తబృందం గోదా అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం రామకృష్ణమాచార్యులను ఘనంగా సత్కరించి ఆధ్మాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహించాలని మంగళాశాసనలు చేశారన్నారు. కార్యక్రమంలో అమరావది కృష్ణచైతన్య, సాయికిరణ్ కిషోర్, బాల లీలాకృష్ణ, కృష్ణస్వామి, రామారావు, కొనకళ్ల సత్యవతి, రత్నకుమారి, కోటేశ్వరి, వనమాలక్ష్మి, సీత, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణమాచార్యను సన్మానిస్తున్న చినజీయర్ స్వామి

నారాయణపురం మైనర్ కాల్వకు మరమ్మతులు చేపట్టాలి

బోనకల్, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్ వద్ద గల నారా యణపురం మైనర్ కాలువ నుంచి నీరు గిరిజన తండా, ప్లాట్లల్లోకి వృథాగా పోతుంది. నీరు ఎక్కువగా నిల్వ ఉండటం వలన పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైనర్ కాలువ నుంచి వృథాగా పోతున్న నీటిని బుధవారం సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి ఆకేన పవన్, టీడీపీ నాయకుడు గొల్లపల్లి కృష్ణారావులు పరిశీలించారు. నారాయణపురం మైనర్ కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కల వలన సాగర్ జలాలు వృథాగా పోతున్నాయని పేర్కొన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.



వృథాగాపోతున్న సాగర్ జలాలను పరిశీలిస్తున్న నాయకులు

వాజపేయి ఆశయాలు సాధించాలి



వాజపేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

బోనకల్, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజపేయి ఆశయాలు సాధించాలని పలువురు నాయకులు అన్నారు. బోనకల్‌లో బుధవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి శత జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పీహెచ్సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నవ భారత నిర్మాణానికి బాటలు వేసిన గొప్ప నాయకుడిగా వాజ్‌పేయి సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు వీరపనేని అప్పారావు, గంగుల నాగయ్య, జిడుగు వెంకటేశ్వర్లు, మరీదు పరుశురాం, జరపల బాలు, గుగులోతు అఖిల్, నాగరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైరాలో...

వైరా, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారతరత్న, మాజీ ప్రధాని వాజపేయి చిత్రపటానికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. వాజపేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం వైరాలో వాజపేయి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ కన్వీనర్ నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు లగడపాటి నాగార్జున, మనుబోలు వెంకటకృష్ణ, దుద్దుకూరి కార్తీక్, ప్రవీణ్, దోసపాటి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చింతకానిలో...

చింతకాని, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని అటల్ బీహారి వాజపేయి శతజయంతి వేడుకలను బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధానమంత్రిగా దేశానికి ఆయన చేసిన సేవల గురించి గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపి, కొరిపల్లి శ్రీను, చింతాల కృష్ణవర్మ పాల్గొన్నారు.

తల్లాడలో...

తల్లాడ, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో బుధవారం మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజపేయి శతజయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక రింగ్‌రోడ్డు సెంటర్లో వాజపేయి చిత్రపటానికి బీజేపీ పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధానమంత్రిగా దేశానికి ఆయన చేసిన సేవల గురించి గుర్తు చేశారు. బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, జిల్లా, మండల నాయకులు చల్లా నాగులు, తేజావత్ బాలాజీనాయక్, తమ్మిశెట్టి కృష్ణ, సంగీతం సాయిచంద్, రాయల రమేష్, పెరిక కిరణ్, యుద్ధనపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.



బోనకల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు



తల్లాడలో వాజపేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చింతకానిలో..

ధాన్యం రైతుల కష్టంపై
చిరుజల్లు

» పలు గ్రామాల్లో కల్లాల్లోనే ఆరబోసి ఉన్న ధాన్యం
» పలుచోట్ల వర్షానికి తడిసిన ధాన్యం
» నిబంధనలతో ఇబ్బందులు పెట్టవద్దని రైతుల వేడుకోలు



కొణిజర్లలో తడిసిన ధాన్యాన్ని చూస్తున్న రైతు

కొణిజర్ల, డిసెంబరు25(ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతుల కష్టంపై ప్రకృతి పగబట్టింది. ఆరుగాలం శ్రమ మొత్తం వర్షార్పణం అయింది. మండలంలో రైతులు సాగు చేసిన ధాన్యంలో సగం కొనుగోలు కేంద్రాల వద్ద, కల్లాలోనే ఉంది. అకాల వర్షాలకు కాస్త పంట ఆగమాగమవుతుంది. పంటను కాపాడుకునేందుకు రైతులు విశ్వప్రయత్నాలు చేసిన పంట తడవక తప్పలేదు. కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న పంట కూడా వర్షానికి తడిసిపోయింది. అధికారులు కొనేటప్పుడు ఎన్ని ఇబ్బందులు పెడతారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే శాతం పేరుతో వారాల తరబడి ధాన్యాన్ని ఆరబోసి ఉంచామని, ఫలితంగా వర్షానికి తడిసిపోయిందని రైతులు కల్లాల్లో నీళ్లను దిగమింగుకుంటూ తడిసిన ధాన్యాన్ని ఆరోబోసుకుంటున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం తెల్లవారుజామున వరకు వర్షపుజల్లులు పడుతూనే ఉన్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని మందకొడిగా కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల కలాసులు(హమాలీలు) ఏడుగురుకు మించిలేకపోవడంతో కాంటా వేయడం ఆలస్యం అవుతుందని రైతులు వాపోతున్నారు.

శాతం వచ్చిన ధాన్యం కూడా తడిసిపోవాలసి వచ్చిందని ఆవేదన చెందుతున్నారు. వాతావరణం మార్పును బట్టి అధికారులు కలాసులను ఎక్కువగా రప్పించి ధాన్యాన్ని కొన్నట్లయితే తమ పంట తడవకపోయేదని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద, కల్లాల్లో ఆరబోసుకుంటున్నారు. ధాన్యంలోకి రాకుండా చుట్టూ కాల్వలు తీస్తున్నారు. తడిసిన పంట పేరుతో శాతాలుతో కారణాలు చెప్పి పంటను కొనకుండా ఇబ్బందులు పెట్టవద్దని, ఉన్నతాధికారులు పరిశీలించి వెంటనే ప్రభు త్వం ధరకు పంటను కోలాలని రైతులు కోరుతున్నారు.



ధాన్యంలోకి నీళ్లు రాకుండా కాల్వలు తీస్తున్న రైతు



తనికెళ్లలో తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతులు

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి గాను అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కల్లూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ క్యాటగిరిలో అర్హులైన అభ్యర్థులు జనవరి నెల 1 తేదీ లోగా ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇదే నోటిఫికేషన్‌లో 6, 7, 8, 9 తరగతులలో బ్యాక్‌లాగ్ ఖాళీలకు అర్హులైన అభ్యర్థులు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. 23 ఫిబ్రవరి 2025న పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

సమ్మె విరమింపజేయండి

కొత్తగూడెం అర్బన్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేయాలని సెంట్రల్ టుబాకో బోర్డు మెంబర్, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవా రం కలెక్టరేట్ దర్నాచౌక్ వద్ద సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిరు ఉద్యోగులు న్యాయం కోసం రోడెక్కారని, ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా సమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు.